రూ.35కే టమోటాలు విక్రయం

సబ్సిడీపై టమోటా విక్రయిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-పీలేరు : దసరా పండుగ సందర్భంగా పీలేరులో సబ్సిడీ ధరపై టమోటాలు కిలో రూ.35 వంతున విక్రయించినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ ఎడి త్యాగరాజు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశాల మేరకు గురువారం పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో టమోటా విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి తమ సిబ్బంది చేత అమ్మకాలు సాగించినట్లు చెప్పారు. బహిరంగ మార్కెట్లో కిలో టమోటాలు రూ.50 నుంచి రూ.70 మేరకు ధర పెట్టి వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. పండుగ సందర్భంగా పేద, సామాన్య ప్రజలు ప్రస్తుత మార్కెట్ ధరలకు టమోటాలు కొనుగోలు చేసి వినియోగించే పరిస్థితి లేక పోవడంతో, ప్రభుత్వ ఆదేశాల మేరకు జెసి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు టమోటాలు కొనుగోలు చేసి సబ్సిడీ ధరపై ప్రజలకు అమ్ముతున్నారు. మార్కెట్ కమిటీ వద్ద ఒక్క రోజులోనే సుమారు మూడు టన్నుల మేరకు టమోటా విక్రయం జరిగినట్లు తెలుస్తోంది.కార్యక్రమంలో స్థానిక ఎఎంసి సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ' వారోత్సవాలను జయప్రదం చేయండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను జయప్రదంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారోత్సవాలలో పంచాయ శాఖ ద్వారా రూ.71 కోట్లకు సంబంధించి 723 పనులను చేపట్టడం జరుగుతుందని వివరించారు. పంచాయతీలోని సాధారణ నిధులు 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా వస్తాయని తెలిపారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు అన్నింటిని పండుగ వాతావరణంలో ప్రారంభించాలని చెప్పారు. పనులకు సంబంధించి ఏజెన్సీ ఎంపిక, మెటీరియల్ ప్రొక్యూర్మెంట్ ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రజా ప్రతినిధుల నుంచి షెడ్యూల్ తీసుకోవాలన్నారు. షెడ్యూల్ మేరకు పనులు ప్రారంభించేందుకు రెండు రోజులు ముందుగా చేపట్టే పనులపై గ్రామాల్లో టామ్ టామ్ వేయించాలని తెలిపారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై సిటిజన్ సూచిక బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీల్లో చేపట్టే పనులన్నింటికీ అధికారికంగా ఆమోదం లభించిందని, భూమి పూజ చేసే కార్యక్రమాల ఫోటోలను పిఆర్ వన్ యాప్‌లో ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నిక్షిప్తం చేయాలని పేర్కొన్నారు. గ్రౌండింగ్ చేసిన పనులన్నిటిని జియోట్యాగ్ చేయాలని, ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానంతో చేపట్టే పనులు గ్రామాలకు స్థిరాస్తిగా నిలిచిపోతాయని తెలిపారు. మనమంతా బాధ్యతగా కష్టపడి పని చేస్తే జిల్లాకు మంచి పేరు వస్తుందని, ప్రజలకు ఉపయోగపడే పనుల ద్వారా ఒక స్థిరమైన అభివృద్ధి ఏర్పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో డ్వామా పీడీ, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇలు, జడ్‌పి డిప్యూటీ సిఇఒ, జిఎస్ డబ్ల్యు ఎస్ అధికారి, ఎంపిడిఒలు, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఇఒపిఆర్‌డిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

ప్రజాశక్తి - కడప

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి అన్నారు. గురువారం ఆర్‌టిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ, రోడ్డు రవాణా శాఖ ఆదాయం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రాయలసీమ జోన్ సమీక్ష సమావేశంలో అధికారులకు దిశా, నిర్దేశం చేసినట్లు చెప్పారు. రోడ్డు భద్రత నిబంధనలను కొనసాగిస్తూనే రవాణా శాఖలో పన్నుల వసూలుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ స్టాప్ అండ్ వాష్ అండ్ గో రెస్ట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. హెచ్చరికల బోర్డులను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. గువ్వల చెరువు ఘాట్‌కు ఇరుపక్కల స్టాప్ అండ్ వాష్ అండ్ గో రెస్ట్ రూములు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ దసరా సీజన్లో ప్రైవేటు బస్సులలో అధిక చార్జీలు వసూలు చేయకుండా దాడులు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో బయటి వ్యక్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా విధి నిర్వహణ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. దళారులతో సంబంధం లేకుండా ప్రజలే నేరుగా రవాణా శాఖ కార్యాలయానికి వచ్చి తమ పనులు పూర్తి చేసుకోవచ్చు అని తెలిపారు. ఎవరైనా దళారులు ఎదురైతే ఆర్టీఏ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

తనీశ్వర్ ద్విశతకం..ఆధిక్యంలో చిత్తూరు

ద్విశతకం చేసిన తనీశ్వర్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-14 ప్లేట్ గ్రూప్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్ ప్రారం భమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90.0 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 407 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టులోని తనీశ్వర్ టెండూల్కర్ డబుల్ సెంచరీ (206 పరుగులు) చేశాడు. మరో బ్యాట్స్మెన్ కెవిఎస్ మణిదీప్ 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ప్రకాశం జట్టులోని లోకేష్ 2, దినేష్ 2 వికెట్లు తీసుకున్నారు.

హోరాహోరీగా కడప, ఈస్ట్ గోదావరి మ్యాచ్ : కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, ఈస్ట్ గోదావరి జట్ల మధ్య హోరీహోరీగా మ్యాచ్ సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.3 ఓవర్లలో 151 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కృష్ణ సాకేత్ రెడ్డి 37, షేక్ 23 పరుగులు చేశారు. కడప జట్టులోని హితేష్ సాయి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. ఆదిత్య 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 49.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఆ జట్టులోని యోగాంజనేయ 50, సాయి కృష్? చైతన్య 35 (నాట్ అవుట్) పరుగులు చేశారు. ఈస్ట్ గోదావరి దత్తులోని తమన్ మూడు వికెట్లు తీసుకున్నాడు.

63 పరుగులకే కుప్ప కూలిన కర్నూలు : కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు, విశాఖపట్నం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 32.3 ఓవర్లలో 63 పరుగులకే అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మోక్షజ్ఞ రెడ్డి 27 పరుగులు చేసి నాట్ అవుట్‌గా నిలుచారు. విశాఖపట్నం జట్టులోని పి.వినోద్ 5, భాను స్వరూప్ 2, వర్మ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖపట్నం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 58.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది. ఆ జట్టులోని తమన్ రెడ్డి 82, ప్రణవ్ శ్రీరామ్ సెంచరీ (103 పరుగులు) చేసి నాటౌట్‌గా నిలిచాడు. విజయ్ కుమార్ 78 (నాటౌట్) పరుగులు చేశాడు.

'ఆదివాసీ హత్యాకాండ రాజ్యాంగ వ్యతిరేకం'

మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

భారతదేశంలో గత పది నెలలుగా కొనసాగుతున్న ఆదివాసీ హత్యాకాండ రాజ్యాంగ వ్యతిరేకమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ హోంలో వారు మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ ఛత్తీస్‌ఘడ్ అబూజ్‌మాడ్‌లోని తెల్తులి-నెండూరు అటవీప్రాంతంలో భద్రతా దళాలు భారీ ఎత్తున దాడి చేసి 31మంది ఆదివాసీలను చంపారని పేర్కొన్నారు. ఇటీవల ఘటనలన్నిటిలోకి తెల్తులి-నెండూర్ ఎన్‌కౌంటర్‌లో ఎక్కువ మంది హత్యకు గురి కావడంతో దేశ వ్యాప్తంగా సంచలనం, ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. మృతులు ఎందరో, ఎవరెవరో పోలీసులు ఒక రోజంతా స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. ఆదివాసీలను రూపుమాపి అక్కడ ఉన్న ఖనిజ సంపద ను కార్పొరేట్లకు దోచి పెట్టడానికి ఇటువంటి హత్యకాండకు పూను కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతులు మావోయిస్టులని, ఎదురు కాల్పుల్లో 31 మంది చనిపోయారని చెప్పారు. మృతులు అందరూ ఆదివాసీ తెగలకు చెందిన వారని, వారిలో 13 మంది మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదివాసుల సంక్షేమాన్ని, క్షేమాన్ని కోరుతున్నామని ఆదివాసీ మహిళను దేశప్రథమ పౌరురాలుగా కూర్చొన బెట్టి, ఆదివాసీ హత్యాకాండకు, హక్కుల అణచివేతకు పూనుకోవటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తెల్తులి - నెండూరు ఘటనతో 2024, జనవరి నుంచి జరిగిన అన్ని ఎదురు కాల్పుల ఘటనలపై న్యాయ విచారణ జరిపించాల్లన్నారు. ఆది వాసులను నిర్మూలించడానికి చేపట్టిన ఆపరేషన్ కగాం ను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం సహాయ కార్యదర్శి ఎం. రవిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు పి రెడ్డయ్య. జిల్లా కార్యవర్గ సభ్యుడు వంగిమల్ల రమణయ్య, సిపిఐ నాయకులు విశ్వనాధ్ నాయక్, బంజారా సంఘం నాయకులు శంకర్ నాయక్, దళిత నాయకులు మర్రిపాటి శ్రీనివాసులు, పామయ్య, బహుజన రక్షణ సమితి నాయకులు నాగార్జున, న్యాయవాది నిరంజన్, బీసీ నాయకులు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

హైవే రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నేషనల్ హైవేలో ఆక్రమణలు తొలగించండి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని నీరుగట్టువారిపల్లి రాధాకృష్ణ సిల్క్ హౌస్ సమీపంలో నేషనల్ హైవే లో అక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తహశీల్దారు ఖాజాబి, అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో కలిసి నేషనల్ హైవే రోడ్డు పనులను పరిశీలించి వెంటనే రోడ్డు వెడల్పు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులను రోడ్డు మలుపు వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌అండ్‌బి, ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకుని సర్వే చేపట్టి రోడ్డుపై ఆక్రమలను తొలగించి రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ ట్రాన్స్‌కో ఇఇ గంగాధర్, నేషనల్ హైవే ఎఇ, సర్వేయర్ చిన్న రెడ్డమ్మ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎస్ఇగా చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇగా చంద్రశేఖర్‌రెడ్డి గురువారం బాధ్యత చేపట్టారు. ఈయన తిరుపతి కార్పోరేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతుల, ప్రజలకు అందుబాటులో ఉండి విద్యుత్ సమస్య లేకుండా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.కార్యాలయాల సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

'ఉక్కు' ఏర్పాటయ్యే వరకూ ఉద్యమం

ప్రజాశక్తి-కడప అర్బన్ : దేశంలో, రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అవతరిస్తుందని, నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆశయాలకు అను గుణంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.సుందరరామరాజు పిలుపునిచ్చారు. గురు వారం ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయ వర్ధన్ అధ్యక్షతన కడప నగరంలోని ఐఎంఎ హాల్‌లో అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో ప్రొద్దు టూరుకి చెందిన ఒంటెద్దు ప్రదీప్‌రెడ్డిని పార్టీలోకి కండువా కప్పి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా సుందర రామరాజు మాట్లాడుతూ ఒంటెద్దు ప్రదీప్ రెడ్డి రాకతో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాయలసీమ వ్యాప్తంగా బలోపేతం అవుతుందని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పోరాటం ముందుండి నడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్య మంత్రులలో ఎక్కువ మంది రాయలసీమ వాసులై ఉండి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చిత్తశుద్ధితో పనిచేయ లేకపో యారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారని వాపోయారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు మూడు ప్రదేశాలలో శంకుస్థాపనలు చేసి కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని వృధా చేయడం తప్ప, నిరుద్యోగుల పట్ల, కడప జిల్లా అభివృద్ధి పట్ల ఎటువంటి ప్రేమ లేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కేవలం ఓట్లు దండుకోవడానికి ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి తీరా అధికారం లేక వచ్చాక పరిశ్రమ ఊసే లేకుండా పోతుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బీరం సుభాష్ చంద్రరెడ్డి, అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శిలు కోటపాటి సుబ్బమ్మ, హిమబిందు, డాక్టర్ జి.వి.సుబ్బయ్య, పృథ్వి, పోతులయ్య పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

ప్రజాశక్తి-కడప అర్బన్

నూతన మద్యం పాలసీ, దుకాణాల టెండర్ల ప్రక్రియ, లాటరీ నిర్వహణపై ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. గురువారం కడప నగరంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల నిర్వహణ కోసం ఆఫ్లైన్ ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరి స్తున్నామని పేర్కొన్నారు. కడప జిల్లాలో 139 షాపులు, అన్నమయ్య జిల్లాలో 111 షాపుల కొరకు మద్యం లాటరీ నిర్వహించడం కోసం దరఖాస్తుల స్వీకరిస్తున్నామని చెప్పారు. దరఖాస్తులు ఆఫ్లైన్, ఆన్లైన్ మోడ్లో ఇంట్లోనే కూర్చుని అప్లై చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు నెట్ సెంటర్లు, ప్రొవిజన్ ఎక్సైజ్ శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నెట్టులో దరఖాస్తుకు అవసరమైన అన్ని అంశాలు ఉన్నాయని తెలిపారు. పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతూ ఉందని చెప్పారు. ఆన్లైన్లో, బ్యాంకు ద్వారా ఫీజు చెల్లించవచ్చని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తు తో పాటు పాస్ కూడా వస్తుందని పేర్కొన్నారు. దానిని తీసుకుని టెండర్ ఓపెన్‌కు హాజరుకావాలని తెలిపారు. జడ్పీ కార్యాలయంలో టెండర్లు ఓపెన్ చేస్తామని చెప్పారు. కలెక్టర్ సమక్షంలో మొత్తం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు గొడుగు ఈనెల 11వ తేదీ వరకు ఉందని తెలిపారు. 14వ తేదీ లాటరీ తీస్తామని చెప్పారు. కడప జిల్లా నుంచి 2225 దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో 1392 దరఖాస్తుల స్వీకరించామని తెలిపారు. దరఖాస్తుకు ఇంకా అవకాశం ఉంది కావున సంఖ్య పెరిగేందుకు వీలుందని చెప్పారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సిఐలు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : మదనపల్లె ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో 22 మద్యం షాపుల ఏర్పాటుకు 528 దరఖాస్తులు వచ్చినట్లు సిఐ భీమలింగ తెలిపారు. లైసెన్సులకు దరఖాస్తు గడువు శుక్రవారంతో ముగియనుందన్నారు. ఆసక్తిగల వారు శుక్రవారం రాత్రి 7 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మదనపల్లె అర్బన్‌లో 10 షాపులకు 235, రూరల్ 4కు 92, బి.కొత్తకోట అర్బన్‌లో 2కు 69, రూరల్ 1కి 23, కురబలకోటలో 3కు 64, నిమ్మనపల్లెలో 1కి 17, రామసముద్రంలో 1కి 28 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు 'మండిపల్లి'

పీలేరు :రతన్ టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా మృతి దేవానికి తీరని లోటని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రతన్ టాటా వ్యాపార రంగంలో గొప్ప పేరు పొందిన వ్యక్తిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో యువత రతన్ టాటా ను ఆదర్శంగా తీసుకుని వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు. **రాయచోటి టౌన్ :** రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రతన్ టాటా మృతితో దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందన్నారు. దేశం గర్వించే వ్యాపార శిఖరం, గొప్ప మేధావిగా ఎన్నో కొత్త ఆవిష్కరణలకు సృష్టికర్తగా, కోట్లాది మంది యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా వారి సృజనాత్మకతను వెలికి తీసిన గొప్ప పారిశ్రామిక వేత్త అని కొనియాడారు. **మదనపల్లె అర్బన్:** మదనపల్లిలోని నిమ్మనపల్లి సర్కిల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతికి టిటిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె వెంకటేశ్, సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు సంతాపం తెలిపారు. లోకేశ్ యువసేన ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. **పీలేరు:** రతన్ టాటా మృతి ఉద్దేశానికి తీరని లోటని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గాంధీ విగ్రహం వద్ద రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి క్రొవ్వత్తులతో ఘన నివాళులర్పించారు. ఈ సందరరేగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉప్పు మొదలు విమానయాన రంగం వరకు భారతదేశ అనువణువులోనూ రతన్ టాటా ఉంటారన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ గ్రూప్ గౌరవ ఛైర్మన్, పద్మ విభూషణ్ రతన్ టాటా మృతి భారతదేశానికి తీరని లోటని, దేశం గొప్ప మానవతవాదిని కోల్పోయిందన్నారు. భారత పారిశ్రామిక రంగానికే కాకుండా ఆయన ప్రపంచ పారిశ్రామిక రంగానికి కూడా ఎన్నో సేవలు అందించారని వారు కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తుమ్మల ధరణ్ కుమార్, అమృత్ తేజ, ఇంతియాజ్, టిఎల్ వెంకటేష్, పాలకుంట శ్రీనివాసులు, సంపత్, బద్దె భానుప్రకాష్, జివియస్ సుబ్రమణ్యం, డాక్టర్ రఘునాథ, చీకటిపల్లి విశ్వకాంత్ బాబు, బెల్లం పురుషోత్తం పాల్గొన్నారు.

పరీక్షల నియంత్రణాధికారిగా రామకృష్ణ నియామకం

ప్రజాశక్తి-కడప

కడప ప్రభుత్వ పురుషుల కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా డాక్టర్ పి.రామకృష్ణ నియమితులయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పురుషుల కళా శాలలో జియాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న రామకృష్ణను నియమించారు. గతంలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.ఎ.జమాల్ బాషా కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్‌గా బాధ్యతలు నిర్వర్తించే వారు. ఆయన స్థానంలో ఈనెల 10వ తేదీ నుండి ఆ బాధ్యతలను 2026వ సంవత్సరం అక్టోబర్ నెల 10వ తేదీ వరకు (రెండు సంవత్సరాల పాటు) నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ గా బాధ్యతలు అప్పగించిన ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సక్రమంగా తన బాధ్యతలను నిర్వహిస్తానని చెప్పారు.

ఆచార్య శంకర్ పరిశోధన పత్రంకు గుర్తింపు

ప్రజాశక్తి-కడప అర్బన్

యుకెలోని ప్రతిష్టాత్మకమైన పరిశోధక కోపసిడెక్స్ జర్నల్ 'కెమ్కామ్'లో ఆరు దశాబ్దాల కాలంలో ప్రచురితమైన పరిశోధన పత్రాలలో అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేయగా అందులో వైవీయూ మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ ఆచా ర్యులు ఎం.వి.శంకర్ రాసిన పరిశోధన పత్రం ఉత్తమమైనదిగా నిలిచి ప్రత్యేక గుర్తింపు లభించింది. కెమ్కామ్ జర్నల్ 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భారతదేశ నుంచి వెలువడిన పరిశోధన పత్రాలను ఎంపిక చేయగా అందులో వైవీయూ ఆచార్యుడికి చోటు లభించింది. 2013, ఆగస్టు 15న వైవీయూ, సిఎస్ఐఆర్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసిటి), హైదరాబాద్ మధ్య సహకారంతో ప్రచురితమైంది. యుకె రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ కెమికల్ కమ్యూనికేషన్ జర్నల్ వారు శంకర్, బృందాన్ని ప్రశంసిస్తూ మెయిల్ ద్వారా సమాచారాన్ని పంపారు. ఆచార్య శంకర్ 2020, 2021, 2022, 2023 సంవత్సరాల్లో 'మెటీరియల్స్, ఎనర్జీ' రంగంలో ప్రపంచంలోని టాప్ 2 శాతం అత్యంత ప్రభావవంతమైన శాస్త్రవేత్తలలో నిలిచిన విషయం తెలిసిందే. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆఫ్ కొరియా (2024) ద్వారా అత్యుత్తమ విదేశీ పరిశోధకులకు అందించే బ్రెయిన్ పూల్ ఫెలోషిప్ ఇటీవలే సొంతం చేసుకున్నారు. యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.రామప్రసాదరెడ్డి, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.విజయ కుమార్ నాయుడు శంకర్‌ను అభినందించారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) విభాగం చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటుచేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, మోటివేటర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో ఆసక్తిగా కష్టపడి చదవాలని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ఉన్న మమకారంతో పాటు వారిని సరైన బాటలో నడిచేలా చూసుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసై ఎంతో మంది వారి జీవితాలను నాశనం చేసుకుంటునారని, ప్రతి ఒక్కరికీ తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలనే తపన ఉంటుందికానీ వారిలో కొంత మంది మాత్రమే తాము అనుకున్న లక్ష్యం వైపు నిష్టగా పయనించి విజయం సాధిస్తున్నారని అన్నారు. కొందరైతే దీనికి కారణం లక్ష్య సాధనలో ఎదురయ్యే అవరోధాలకు భయపడి జీవితాలను దుర్భంగా మార్చుకుంటున్నారని అన్నారు. లక్ష్య సాధనకు అనువైన మార్గం గురించి శోధించాలని, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విజయం వైపు సాగాలని అన్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా లొంగిపోకూడదు, కుంగిపోకూడదని చెప్పారు త్మవిశ్వాసంతో అవరోధాలపై ఆధిపత్యం సాధించ గలిగితే విజయం తథ్యమని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ కళాశాలలో చదివే తమ పిల్లలు కళాశాలకు క్రమంగా హాజరు అవుతున్నారా, పరీక్షలో వారి పనితీరు ఎలా ఉందనే విషయాన్నీ కనీసం నెలకు ఒకసారి అయిన కళాశాల కు వచ్చి తెలుసుకోవాలని అన్నారు. కళాశాలలో విద్యార్థులకు కావలసిన సదుపాయాలు అన్ని ఉన్నాయని, విద్యార్థులు సకాలం లో వాటిని ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ చొక్కనాథమ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్, హాజరైన తల్లిదండ్రులు

మాట్లాడుతున్న ఎంపిడిఒ జవహర్‌బాబు

ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు

కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులోఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎంపిడిఒ సి.ఎ.జవహర్‌బాబు పేర్కొన్నారు. గురువారం సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యాలయానికి వచ్చే ప్రజలను విసిగించకుండా వారిని కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరించి అర్హులైన వారి అందరికి ప్రభుత్వ పథకం అందేలా సిబ్బంది చొరవ చూపాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎస్‌ఎండి. అయూబ్, సీనియర్ అసిస్టెంట్ కె.రమణయ్య జూనియర్ అసిస్టెంట్ పి.ఇంద్రనాథరెడ్డి, టైపిస్ట్ సులేమాన్‌బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడి మేష

సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఎడి

ప్రజాశక్తి-గాలివీడు

వ్యవసాయంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక లాభాలు పొందవచ్చని ఎడి అల్లిరెడ్డిపల్లి మేష పేర్కొన్నారు. మండలంలోని గుండ్ల చెరువు, గరుగుపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో పొలంబడి పిలుపొందిన కార్యక్రమాన్ని ఎఒ జయరాణి, ఎఇఒ మురళీధర్, మనీ అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటేష్, పాపిరెడ్ భాను కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళ,బుధ వారాల్లో మండలంలో రోజుకి రెండు రైతు సేవ కేంద్రంలో పొలంబడి పిలుపొందిన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. వ్యవసాయంలో చేపట్టాల్సి సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలని సూచించారు. తక్కువ పెట్టుబడి అధిక లాభాలు ఎలా పొందాలో రైతులకు వివరించారు. రైతుల నుంచి సందేహాలు స్వీకరించి నివృత్తి చేశారు. కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనాన్ని అందిస్తున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-వీరబల్లి

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షల నిమిత్తం గర్భిణులకు ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో గురువారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనీషా మాట్లాడుతూ ఎంపిపి ప్రతినెల ఏదో ఒక రోజు గర్భిణులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమని అన్నారు.దాతలు ముందుకు వచ్చి పేదలైన గర్భిణీలకు పౌష్టిక ఆహారం అందించాలని కోరారు. గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రతి నెలలో గర్భిణులకు పౌష్టికాహారం అందించడం సంతోషంగా ఉందన్నారు. చాలా మంది పౌష్టికాహారానికి నోచుకోక రక్త కొరతతో కాన్పు సమయంలో ఇబ్బందులు గురికావడం భాదకరమని అన్నారు. తన వంతుగా గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో విఆర్‌డిఎస్ సురేంద్రరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మకు బంగారు కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బంగారు కిరీటాన్ని చూపుతున్న చిన్నరెడ్డెప్ప

పట్టణంలోని కోర్టులో గంగమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షులు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి ప్రభాకం నాయుడు సంయుక్త ఆధ్వర్యంలో సభ్యులతో కలసి అమ్మవారి ఆలయంలో బంగారు కిరీటాన్ని ప్రదర్శించారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా విజయ దశమి రోజు శనివారం అమ్మవారు బంగారు కిరీట దారణలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరుగుతుందని ప్రకటించారు. పుర ప్రజలు, భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయదశమి రోజున పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముత్తై దువు లకు వాయినాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి ఆర్.రంగస్వామి నాయుడు, జోళపాళ్యం కరుణాకర్ నాయుడు, జోళపాళ్యం భవాని ప్రసాద్, జోళపాళ్యం దేవేంద్ర, సభ్యులు బి.శ్రీనివాసులు నాయుడు,ఆలయ అర్చకులు సుస్మిత్‌స్వామి పాల్గొన్నారు.

IN THE COURT OF THE
Prl. JUNIOR CIVIL JUDGE,
MADANAPALLE
O.S.No. 281/2021

D.Venkata Ramana Reddy. ...Plaintiff

Vs

K.Amarnath. ...Defendant

SUMMONS TO DEFENDANT

K.Amarnath, S/o Late, K.Siddappa, D.No.III-146-3-02, Sapthagiri Nagar, Madanapalle.

పై కేసులో కోర్టు నుండి వచ్చు సమన్లును తీసికోనందున పేపర్ ప్రకటన ద్వారా 16.10.2024 నాడు ఉదయం గం.10.30 లకు నీ హాజరు నిమిత్తము ఉన్నది. నీవు హాజరు కానంతట నీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//
A.MOHAN KUMAR,
B.A.,L.B.L.,
Advocate,
MADANAPALLE.

మహారాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, మదనపల్లి వారి కోర్టు నందు
O.S.No. 559/2023

పి.వెంకటరమణ ...వాది

Vs

పి.విశ్వనాథ్ ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

పి.విశ్వనాథ్,S/o పి.క్రిష్ణప్ప, డోర్‌నెం.9-85, అంగజాలపల్లి, H/o పెద్దపాళెం, ములకలచెరువు మండలం, అన్నమయ్య జిల్లా.

పై దావాలో వాది నీ దగ్గర నుండి బాకీ రాబట్టుకొనుటకు దాఖలు చేసిన పై కేసు నందు వారు నీవు 07.11.2024వ తేదీన ఉదయం 10 గంటలకు పై కోర్టు నందు హాజరై నీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. నీవు అట్లు హాజరు కాని యెడల పై కేసు నీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//
కె.సంపత్, B.Com, B.L.,
అడ్వకేట్, మదనపల్లి.
సెల్: 9441451044.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

రైల్వేకోడూరు :ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి అన్నారు. జాతీయ అంధత్వ, దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా 25 వ ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ఆప్తమాలజీ అధికారి పోలిచర్ల ఓబులేసు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరీరంలో కళ్ళు అతి ప్రధానమైనవని అన్నారు. పోషకాహారంలోపంతో చిన్న వయస్సులోనే దృష్టి లోపం ఏర్పడుతుందన్నారు. మొబైల్స్, టివిలు ఎక్కువుగా చూడటంలో చిన్న వయస్సులో కంటి అద్దాలు వస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ కళ్లను సంరక్షించుకోవాలని సూచించారు. **కలకడ :** సర్వేంద్రియానం నయనం ప్రదానమని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్.వి.కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. మండలం లోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఎంవి.కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిహెచ్ఇఒ జయరామయ్య సిబ్బందిక దృష్టి లోపంపై అవగాహన కల్పించారు. 25వ జాతీయ దృష్టి దినోత్సవ కార్యక్రమం పాపిరెడ్డిగారి పల్లి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ ర్యాలీ ఉద్దేశించి వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దృష్టిలోపంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంఎల్‌హెచ్‌పిలను ఆరోగ్య కార్యకర్తలను ఆశా కార్యకర్తలను దృష్టి లోపంపై అవగాహన కల్పించాలని 50 సంవత్సరాలు పైబడిన వారందరికీ బిపి, షుగర్ ఉన్నవారు దృష్టిలోపం ఉంటుందని వారం దరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఆరు మాసాలకు ఒక మారు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంధత్వ నివారణను రూపుమాపాలని మానవ దేహంలో కళ్ళు ప్రధానమైనవని దృష్టి లోపం వస్తే మానవ జీవితం దుర్భరమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇ ఒజి జయరామయ్య, స్టాఫ్‌నర్స్ భారతమ్మ, పిహెచ్ఎన్ శు భరత్నమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, బి.రెడ్డమ్మ, షేక్ జమీల్, అహ్మద్ ల్యాబ్ టెక్నీషియన్ షేక్ షరీఫ్ బాషా, ఫార్మసిస్టు, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** అన్నమాచార్య యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ విభాగం, డాక్టర్ అగర్వాల్ ఐ క్లీనిక్ సంయుక్తంగా ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురష్కరించు కొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ సంతోష్ అగర్వాల్, ఐ క్లీనిక్ వారు మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం పొందితే దృష్టి లోపాన్ని నివారించవచ్చున్నారు.విద్యార్థులు దృష్టిలోపం ప్రారంభంలోనే వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలని చెప్పారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లికార్జున రావు మాట్లాడుతూ విద్యార్థులు సరియైన పౌషకాహారం తీసుకోవడం వలన దృష్టిలోపాన్ని నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎం వి నారాయణ, ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎల్ ఓబులపతి, ఇఇఇ విభాగా ధిపతి డాక్టర్ ఎం.పద్మలలిత, డాక్టర్ బిపి చెన్నయ్య, ఇఇఇ ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి టి.అరుణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కలకడ : అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి-గుర్రంకొండ



గుర్రంకొండ:దుర్గమ్మ అలంకారంలో రెడ్డెమ్మ

మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని రెడ్డమ్మ దేవత దేవస్థానంలో దసరా శరన్నవ రాత్రల్లో భాగంగా ఎనిమిదివ గురువారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మ వారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరిమళభరిత పుష్పాలతో అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి సామూహిక కుంకుమార్చన నిర్వహించినట్లు చెప్పారు. పూజలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొట్లి ఎర్రంరెడ్డి కుటుంబ సభ్యులు (అర్చకులు) ఉభయదారులుగా వ్యవహరించారు. తొమ్మిదవ రోజు మహిషాసుర మర్దినీ దేవిగా దర్శనమిస్తారని ఆలయ ఇఒ మంజుల తెలిపారు.**నిమ్మనపల్లి:** దేవీ శరన్న వరాత్రి ఉత్సవాలలో భాగంగా నిమ్మనపల్లి పెద్దమాదిగ పల్లిలోని మాతమ్మ త నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక అలంకరణలతో అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.**రామసముద్రం :** మండలంలోని కాపల్లె పంచాయతీ అజ్జమరెడ్డిపల్లి సమీపంలో రాష్ట్ర టిడిపి బిసి సెల్ ఉపాధ్యక్షులు మోడెమ్ సిద్ధప్ప కుటుంభకులు నిర్మించిన రాజరాజేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికి, మహిళలు మంగళహారతులతో ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు జునైద్ అక్బరీ, రామసముద్రం మండలం టిడిపి అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్, మాజీ జడ్పిటిసి శివశంకర్ ,మాజీ మండల అధ్యక్షులు కృష్ణంరాజు, సీతారామయ్య స్వామి, చొక్కాండ్లపల్లి పెద్దిరెడ్డి,రెడ్డెప్ప రెడ్డి, గౌనివారిపల్లె రెడ్డెప్ప,మాల మహానాడు అధ్యక్షులు క్రిష్ణప్ప, నాగరాజు ,సర్పంచ్ ఇంజం వెంకటరమణ ,మాజీ సర్పంచులు శ్రీనివాసులు, క్రిష్ణమూర్తి , వెంకటరమణ, ప్రశాంత్ రెడ్డి,తిప్పన్న, లోకనాథ్‌రాజు పాల్గొన్నారు.

నేడు లక్ష కుంకుమార్చన

రాజంపేట అర్బన్ : టిటిడి హిందూ ధర్మా ప్రచార పరిషత్తు అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాజంపేట పట్టణం మన్నూరులోగల ఉదయగిరి ఎల్లమ్మ తల్లి దేవస్థానములో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి లక్ష కుంకుమార్చన కార్యక్రమం జరగనున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం భక్త బృందాలచే లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం ఉంటుందని, కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు ఆలయ కమిటీ గతంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన శేష వస్త్రాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు హాజరై జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షులు నక్కా సాయి ప్రసాద్, కార్యదర్శి పోతుల సుధాకర్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపి బాబు, ధర్మచార్యులు గంగనపల్లి వెంకటరమణలు ప్రకటన ద్వారా కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న శివశంకర్

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శివశంకర్ పేర్కొన్నారు. మండలంలో ఎరువుల వ్యాపారస్తులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని అన్నారు. గురువారం మదనపల్లి డివిజన్ సహాయ సంచాలకులు శివశంకర్, వ్యవసాయ అధికారి జె.చంద్రశేఖర్ గట్టు గ్రామంలోని మంజునాథ, శ్రీవినాయక ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. మంజనాధ ఫర్టిలైజర్స్ స్టాక్ రిజిష్టర్ సరిగ్గా నిర్వహించకపోవడం, బిల్లులను రైతులకు ఇవ్వక పోవడం, స్టాకు వివరాలు చూపకపోవడంతో లైసెన్సును 15 రోజుల వరకు సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు. యూరియా కొరతను అదిగమించుట కొరకు అన్ని రైతుసేవా కేంద్రాలలో యూరియా పంపిణీ చేస్తున్నామన్నారు. రాబోవు రెండు, మూడు రోజుల్లో అన్ని రైతు సేవ కేంద్రాలకు యూరియా వస్తుందన్నారు. మడలంలోని ప్రయివేట్ ఎరువు వ్యాపారులు ఎవరైన యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా, యూరియాతో ఇతర ఎరువులు ఖచ్చితంగా కొనాలనే నిబంధన పెట్టినా వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సబ్సిడీ ధరలకు వంట నూనె అందించాలి

ప్రజాశక్తి-పీలేరు

దసరా పండుగను పురస్కరించుకుని పీలేరు ప్రాంత ప్రజల కోసం సబ్సిడీ ధరపై వంట నూనెలు అందుబాటులోకి తెస్తూ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పీలేరుకు చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోధిషావలి కోరారు. గురువారం ఆయన పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించిన జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి త్యాగరాజును కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బోధిషావలి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే మదనపల్లి, రాయచోటి, ప్రాంతాలలో దాదాపు 16 కౌంటర్లను ఏర్పాటు చేసి, వినియోగదారులకు నూనె విక్రయం అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. పీలేరు పరిసర ప్రాంత ప్రజల కోసం కూడా సబ్సిడీ ధరపై నూనె అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా, రాయచోటి మండలం చెన్నముక్కపల్లె గ్రామం, కొలిమి మిట్ట డోర్ నెం. 4/26 షేక్. మహబూబ్‌జాన్ భర్త ముబారక్ గల పాస్‌పోర్ట్ నెంబర్ **R7867588** గల ఒరిజినల్ పాస్ పోర్ట్ రాయచోటి మార్కెట్ లో కూరగాయలు తీసుకొని వస్తుండగా మార్గమధ్యలో పోయినది. ఎవరికైనా దొరికినచో **9100304146** మొబైల్ నెంబర్‌కు తెలపగలరు.

ఎంపిడిఒను సన్మానిస్తున్న ఎంపిపి, కూటమి నాయకులు

ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి-సుండుపల్లి

టి.సుండుపల్లి మండలం ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన సుధాకర్ రెడ్డిని గురువారం ఎంపిపి రాజమ్మ, జనసేనరామ శ్రీనివాస్ కలిసిన సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరికీ అందు బాటులో ఉంటూ గ్రామపంచాయతీలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలోనాయకులు నాగరాజ,ఉపాధ్యక్షులు వెంకటరమణ నాయుడు, టిడిపి మండల ఉపాధ్యక్షులు యర్రంరెడ్డి,మైనార్టీ నేత మేకల మహబూబ్‌బాషా, రాజంపేట పార్లమెంట్ టిడిపి వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి దామోదర్ నాయుడు, ఎస్‌టిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంద్ నాయక్, రాజంపేట పార్లమెంట్ ఎస్‌టి సెల్ ఉపాధ్యక్షులు జయరామ్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ సర్పంచ్ రాము నాయక్, బూతు కన్వీనర్ వెంకటేష్ పాల్గొన్నారు.

'బోయకొండ' చైర్మన్‌గా బిసిలకే అవకాశమివ్వాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆలయ చైర్మన్‌గా బిసిలకు బిసి వర్గానికి చెందిన గంపల గంగరాజుకే అవకాశం ఇవ్వాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు బొమ్మనపల్లి లక్ష్మన్న అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారి టీలతో సమావేశం నిర్వహించారు. పుంగనూరు నియోజక వర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ దేవస్థానం రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధిగాంచిందని అన్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని పేర్కొన్నారు. గంపల గంగరాజు 20 సంవత్సరాలకు పైగా తన వంతు సేవలు అందిస్తూ, ప్రత్యక్షంగా పరోక్షంగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. బోయకొండ దేవస్థానం చైర్మన్ గా ప్రభుత్వం అవకాశం కల్పించాలని అంబేద్కర్ సంఘం ద్వారా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి బోయకొండ ఆలయ చైర్మన్‌గా ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రయ్య, సహదేవ, గంగులప్పా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని కాప్పల్లి పంచాయతీ అజ్జమ రెడ్డిపల్లికి ఆలయపూజకి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో దాదాపు పది కుటుంబాలు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. టిడిపిలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని అన్నారు. రామసముద్రం మండలానికి మూడు కోట్లు సిమెంట్ రోడ్లు, గట్టు వెంకటేశ్వర స్వామి ఆలయానికి 80 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయన్నారు. ఆర్ నడింపల్లి పంచాయతి బల్లసముద్రం సమీపంలోని శ్రీ వాళీశ్వర స్వామి కొండపైకి రెండు కోట్ల రూపాయలతో రోడ్డు వేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ కోవా కృష్ణమూర్తి, వెంకటరమణ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సిద్ధప్ప, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రికార్డులు పరిశీలిస్తున్న సిఐ చాంద్‌బాషా

తనిఖీల్లో 200 వాహనాలు సీజ్ : సిఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శాంతిభద్రతల పరిరక్షించేందుకు కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు సిఐ చాంద్‌బాషా తెలిపారు. గురువారం మదనపల్లె రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామారావు కాలనీ, గౌతమినగర్, చంద్ర కాలనీ, గజ్జలకుంట, గౌతమినగర్, చీకలిగుట్ట, ముజీబ్ నగర్, దేవత నగర్, విజయనగర్ కాలనీ, లక్ష్మీ నగర్ తదితర ప్రాంతాలలో సుమారు 1000 మంది పోలీసులు ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. అనుమానితులను విచారించారు. వాహనాలకు రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని సుమారు 200 ద్విచక్ర వాహనాలు, ఆటోలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో జీవించేందుకు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, డిఎస్‌పి కొండయ్య నాయుడు ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అనుమానితుల పై నిఘా పెట్టామని, అనుమానితులు ఉన్నట్లయితే స్థానిక ప్రజలు పోలీసులకు తెలపాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రజలు పోలీసులకు సహకరించి అక్రమార్కులను పట్టుకోవడానికి సహకరించాలని కోరారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు తీసుకొస్తే వారి వాహనాలను వారికి అప్పగిస్తామన్నారు. కార్డన్ సెర్చ్‌లో సిఐలు రామచంద్ర, రమేష్, కళా వెంకట్రమణ, రాజారెడ్డి, రాజా రమేష్, ఎస్ఐలు, ఎఎస్ఐ పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆచూకీ పోలీసులు కనుగొన్నారు. మదనపల్లె మండలం, పెంచుపాడు గ్రామం, రెక్కమాను గుట్టలో బుధవారం ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మృతుడి వివరాలులభించినట్లు తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మృతుడు నిమ్మనపల్లి మండలం గుండ్లవారిపల్లెకు చెందిన ఆదినారాయణ అలియాస్ బాబు (50)గా గుర్తించినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసు కున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : కారు ఢీకొని దంపతులు తీవ్రంగా గాయపడ్డ సంఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు ..పట్టణంలోని చంద్రకాలనీకి చెందిన దంపతులు వెంకటరమణ, లక్ష్మీదేవి బైక్‌లో ఎస్‌బిఐ కాలనీలోని లాండ్రీ షాపుకు బయలుదేరారని తెలిపారు. మార్గమధ్యంలోని నీరుగట్టుపల్లె వద్ద చౌడేశ్వరిగుడి వద్ద వీరిని కారు ఢీకొట్టినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దంపతులను స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఎల్లమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరు పతి రుయాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారుకాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రియుడు మోసం చేశాడని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: ప్రియుడు మోసం చేయడాన్ని జీర్ణించుకోలేని ఓ యువతి గురు వారం కళ్లి పాలు తాగి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడింది. పుంగనూరు మండ లంలో చోటుచేసుకున్న ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని ఈడిగపల్లెకు చెందిన 21ఏళ్ళ యువతి స్థానికంగా ఉన్న ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. అక్కడ పనిచేసే ఓ యువకుడు ప్రేమ పేరుతో దగ్గరై, గత రెండేళ్లుగా ఇద్దరూ సహజీవనం చేసినట్లు తెలిపారు. ప్రియుడు ఇప్పుడు అదే షాపులో పనిచేసే మరో యువతీతో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తుండడంతో జీర్ణించుకోలేక కళ్లి పాలు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు గమనించి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించామని తెలిపారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు రిఫర్ చేశారు.ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు : మండల పరిధిలోని బుధవారం రాత్రి వడిసెలవంకపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మర్రిపల్లి వరుణ్‌కుమార్ అనే యువకుడు మృతి చెందాడు. ట్రాక్టర్ తన కుమారుడి బైక్‌ను ఢీ కొట్టడం వల్లే మృతి చెందాడని చిన్నమండెం మండలం దిగవగొట్టివీడు పంచాయతీ జంగంపల్లికి చెందిన మృతుడి తండ్రి రాజప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ టివి.కొండారెడ్డి పేర్కొన్నారు. టాక్టర్ ను అదుపులో ఉంచుకున్నామని డ్రైవర్ ప్రమాదం జరిగిన చోటనే అదృశ్యం కావడంతో డ్రైవర్ కోసం అన్వేషిస్తున్నామని పేర్కొన్నారు.

రైలు ఢీకొన్న ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-పీలేరు : రైలు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పీలేరులో చోటు చేసుకుంది. పీలేరు మోడల్ కాలనీ సమీపంలోని రైల్వే ట్రాక్ పై రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడని గురువారం తనకు అందిన సమాచారం మేరకు విచారణ కోసం వచ్చినట్లు కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా తెలిపారు. తిరుపతి నుంచి గుంతకల్లుకు వెళ్లే రైలు ఢీ కొని యువకుడు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు మోడల్ కాలనీలో నివాసం ఉంటున్న సహదేవ కుమారుడు భాను ప్రకాష్ (21) గా గుర్తించామని తెలిపారు. ఇతను గతంలో వాహన ప్రమాదంలో గాయపడి, మతిస్థిమితం కోల్పోయి తిరుగుతూ ప్రమాదవశాత్తు రైలు కింద పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడ పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులకు అప్పగించి నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ద్విచక్ర వాహన ప్రమాదంలో వ్యక్తి..

పీలేరు: ద్విచక్ర వాహన ప్రమాదంలో విశ్రాంత అటవీ శాఖ అధికారి మృతి చెందిన సంఘటన పీలేరులో చోటుచేసుకుంది. స్థానిక అర్బన్ ఎస్ఐ బాలకృష్ణ అందించిన వివరాల మేరకు కెవి పల్లి మండలం, గోరంట్లపల్లి పంచాయతీ, అంబువారిపల్లికి చెందిన విశ్రాంత అటవీ శాఖ ఉద్యోగి శంకర్ (73) పీలేరు నుంచి చిత్తూరు మార్గంలోని ఎంజెఆర్ కళాశాల సమీపాన ఉన్న కోడిగుడ్ల విక్రయ కేంద్రానికి తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా, మోడల్ కాలనీ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొందన్నారు. ఈ ప్రమాదంలో ఆయన ఘటనా స్థలంలోనే మృతి చెందగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

చెరువులో మృత దేహం లభ్యం

ప్రజాశక్తి-కలికిరి : మండలంలోని బాలవారిపల్లి చెరువులో నాలుగురోజుల తర్వాత మృత దేహం లభ్యమైనట్లు సిఐ రెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు..మండలంలోని మరికుంటపల్లి గ్రామం వీరవాళ్లపల్లికి చెందిన మర్రిపల్లి హరినాధ అనే వ్యక్తిని కలికిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులు తమకు కొబ్బరికాయలు కోసి ఇవ్వాలని ఈనె 2న ఇంటి నుంచి ఆటోలో తీసుకవెళ్లినట్లు మృతుడి సోదరుడు కృష్ణయ్య కలికిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామని అన్నారు. గ్రామస్తులను విచారించగా మృతుడు హరినాధ పత్తేగడ పంచాయతీ కొత్త మాలపల్లిలో కొబ్బరి చెట్టు నుంచి కొబ్బరికాయలు కోసే క్రమంలో కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందడంతో తీసుకొని వెళ్ళిన ముగ్గురు వ్యక్తులు భయపడి అతని మృతదేహాన్ని తీసుకెళ్లి పీలేరు రోడ్డు మార్గంలో గల బాలం వారిపల్లి ప్రాజెక్టు నీటిలో వేశారని తెలిపారు. ఆ ప్రాజెక్టు వద్దనే కుళ్ళిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని కలికిరి ప్రభుత్వ ఆస్పత్రి తరలించి డాక్టర్ అన్వేష్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.